# సింగిల్‌పేజి కథలు

నీరజకి చాలా అసహనంగా ఉంది. విసురుగా బస్టాపు చేరుకుంది. అక్కడ కూడా ఆమెకు అశాంతిగానే ఉంది. వద్దన్నా పదే పదే జరిగిన సంఘటనే కళ్ళముందు కదలాడుతోంది.

అసలు ఆ విమల వదిన తన గురించి ఏమనుకుంటోంది? అక్కడికి తను కష్టపడిపోతున్నట్టు, నేను సుఖాల్లో తేలిపోతున్నట్టూ భావిస్తోందా?

ఉదయం టైము అందరికీ హడావిడే కదా. నేను బట్టలు ఐరన్ చేసుకుంటుంటే "ఆ కాఫీ కలుపుకుని తాగేయి నీరజా మీ మేనల్లుడు చొక్కా కన్పించలేదు. అదే కావాలిట. లేకపోతే ఇల్లుపీకి పందిరేస్తాడు. ఇంకా పులుసులో పోపు పెట్టాలి" అంది.

"నేనూ త్వరగా రెడీ అవ్వాలి. బస్సు మిస్సు అవ్వకూడదు కదా ఖాళీగా ఉన్నాను. నువ్వే పెట్టి ఇద్దూ" అన్నాను.

ఈమాత్రానికే ఎంత గొడవ చేసింది. "అవునవును అందరికీ కంగారే. ఎటొచ్చి అందరికీ అన్నీ అమర్చి పెట్టే నాకే తీరిక మరి" అంది వ్యంగ్యంగా. దాంతో తనకీ చిర్రెత్తుకొచ్చింది. తనూ రెండు మాటలు అంది. "అందరూ వెళ్ళాక తీరుబడేగా. అయినా వంట పెద్ద కష్టమేముంది?" అంది.

"అవును ఉద్యోగాలు చేసేవాళ్ళకి, ఇంట్లో వాళ్ళు అలుసేమరి. ఈమధ్య ఒక పేరు పెట్టారుగా 'హౌస్ వైఫ్' అనీ" అంది కొంచెం ఘాటుగా. అదే చిలికి చిలికి 'గాలివాన' అయింది. తనకీ కోపాన్ని, విసుగును పెంచింది. మళ్ళీ టైము చూసుకుంది. ఇంక ఎదురు చూసే ఓపిక లేదు. ఆటో కేకేసి ఏరియా చెప్పి ఎక్కి కూర్చుంది. 'లేటయితే ఆ బాస్ పెట్టే చీవాట్లు, చూపులూ తను భరించలేదు. ఆ 'బాస్'కి ఆడవాళ్ళంటే చులకన. అదీకాక వీళ్ళు వేలకి వేలు సునాయసంగా సంపాదించేస్తున్నారన్న ఏడుపు. టీవీల్లో, పేపర్లో బాస్‌లు, సబార్డినేట్లూ సుహృద్భావ వాతావరణంలో పన్లు చేసుకోవాలని, ఆర్డర్లు కాక ప్లీజింగ్ ఉండాలనీ, వ్యక్తిత్వ వికాసమని ఏమిటో చెప్తారు. కానీ ఎవరి 'ఇగో' వదులుకోవడాన్ని ఎవరు ఇష్టపడుతున్నారు? సర్లే వాడ్ని తలుచుకుంటే మూడ్ మరింత పాడవుతుంది' అనుకుంటూ రోడ్డు మీదకి దృష్టి సారించింది.

కంప్యూటర్‌తో కుస్తీ పట్టి స్టేట్‌మెంట్స్ అన్నీ ప్రింట్ అవుట్ తీసి బాస్ టేబుల్‌మీద పెట్టేసరికి ఏడుగంటలు కావస్తోంది. ఉస్సురంటూ బస్సులో ఇంటికి వచ్చేసరికి 8 గంటలు అయిపోయింది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి, వదిన చాలా మంచిది. పొద్దున్న విషయమే గుర్తు లేదు. చిరునవ్వుతో కాఫీ కప్పుతో ఎదురొచ్చింది. వదినలో ఇదో సుగుణం. సాగదీయదు. నిజానికి ఇద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్.

విమల తండ్రి పరంధామయ్యగారు, నీరజ తండ్రి రాఘవరావుగారు ఒకే ఆఫీసులో పనిచేసేవారు. అయినా వారిద్దరూ బాల్యం నుంచీ స్నేహితులు; వారి స్నేహం విడదీయలేనిది. వారి స్నేహాన్ని 'బంధుత్వం'గా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకే నీరజ అన్న ధీరజ్‌కి

## ఇల్లాలు



విమలకి చిన్ననాటే వివాహం నిశ్చయం చేసేశారు. ధీరజ్ బ్యాంకు ఆఫీసరుగా జాయిన్ అయ్యాడు. నీరజ వివాహం తరువాత ధీరజ్‌కి చెయ్యాలనుకున్నారు.

నీరజ ఎమ్.ఎస్.సి. కంప్యూటర్స్ చేసిన వెంటనే జాబ్‌లో జాయిన్ అవడం జరిగింది. ఒకటి, రెండు సంబంధాలు చూసినా నీరజకు నచ్చలేదు.

కానీ విమల చెల్లెలు అమలకు బావతో వివాహం నిశ్చయం కావడంతో వాళ్ళు తొందర పెట్టడంతో ధీరజ్ విమలకు అనుకున్నట్లుగానే వివాహం జరిగిపోయింది.

నీరజకు ఇంటి పనుల అస్సలు తెలియదు. విమలకు ఉద్యోగం చెయ్యాలనే సరదా ఉండేది. కానీ వివాహం అవడం తరువాత రాజేందర్ పుట్టడంతో ఆ కోరిక అలా వాయిదా పడింది.

ఇప్పుడు రాజేందర్‌ని చేర్పించిన కాన్వెంటులోనే తనూ టీచర్‌గా జాయిన్ అయింది. కాలచక్రంలో రెండేళ్ళు హడావిడిగా గడిచిపోయాయి. నీరజకి అదే ఊరిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో వివాహం జరిగిపోయింది. ఆమె అత్తారింటికి వెళ్ళిపోయింది.

ఉదయాన్నే లేవడం ఇంటిపని, ఉద్యోగం రొటీన్. తీవ్రమైన ఒత్తిడి విమలకు. తనకంటే ఓ యంత్రం నయమనిపిస్తోంది. పిల్లల్ని ఎంతో బాగా చదివించాలనీ మంచి పౌరులుగా చెయ్యాలనీ తాపత్రయపడబోయింది. హెడ్ మిస్ట్రెస్ పిలిచింది. "ఏమిటమ్మా నువ్వు పాత విధానంలో వాళ్ళకి అర్థమయ్యేట్టు చెపుతున్నావా? అదంతా కుదరదు. బట్టీవేయడం, ఇంగ్లీషు ఫ్లూయంట్‌గా మాట్లాడటం, నేర్పించు..పెద్దయ్యాక అర్థాలు వాళ్ళే తెల్సుకుంటారు. కాన్వెంట్ కల్చరే తెలిసినట్టు లేదు" అంది. తనకి నోటమాట రాలేదు. నీరసంగా తలూపింది.

ఇంటికి వచ్చినా పేపర్స్, కాంపోజిషన్స్ దిద్దడం చాలా విసుగ్గా అన్పించింది. సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకున్నట్టు అయింది. నిజానికి తనకి అంత ఆర్థిక అవసరాలు లేవు.

ఇదివరకు ఇంట్లో ఉన్నప్పుడు అందరూ వెళ్ళాక కొంత రెస్ట్ తీసుకుని లీజర్లీగా పనిచేసేది. అందరూ వచ్చేసరికి అమర్చిపెట్టగలిగేది. ఈమధ్య ఏమీ చేయలేకపోతోంది. రాజేందర్ తరచూ అనారోగ్యం పాలవుతున్నాడు.

ఆ రోజు ఆదివారం. "వదినా, వదినా" అంటూ నీరజ వచ్చింది. "అబ్బ నిన్ను చూసి కొన్ని యుగాలయినట్లుంది. రా నీరజా! ఈమధ్య మరీ బోర్ కొడుతోంది" నీరజ చెయ్యి పట్టుకుని స్నేహంగా కూర్చోబెడుతూ అంది విమల.

ఇద్దరూ ఎంతో స్నేహంగా కబుర్లు మొదలుపెట్టారు.

"ఇప్పుడు చెప్పు నీ ఉద్యోగం ఎలా ఉంది?" అంది నీరజ.

"అయ్యబాబోయ్ దాని సంగతి అడగకు. ఇంక రిజైన్ చేసేద్దాం అనుకుంటున్నాను. చదివిన చదువు సార్థకం చేసుకుందాం అనుకున్నా కానీ ఈ రెండూ మేనేజ్ చేయడం నా వల్ల కాదు. మనకి స్వేచ్ఛ లేని రూల్స్ ఈ కాన్వెంటు నాకు నచ్చ లేదు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను. నాకు ఖాళీ ఉన్న సమయం సాయంత్రం ట్యూషన్స్ చెప్తాను. అదే తృప్తి ఇస్తుంది. ఉద్యోగం నువ్వెలా చేస్తున్నావో కానీ. నీ సంగతి చెప్పు"

"అప్పుడు ఇంటి పనులకేముందిలే అనుకున్నాను. కానీ గృహిణి బాధ్యత కష్టతరమైనదే. నువ్వు ఎంత ఓర్పుగా చేశావో. అప్పట్లో నా ప్రవర్తన తల్చుకుంటే సిగ్గేస్తోంది. నిజానికి వంటింట్లో కూడా ప్లానింగ్ అవసరం.

